అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 17 నవంబర్ 2023 పేజీలు : 04

# రానున్నది టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం

- బాలయ్య నోట జై జనసేన నినాదాలు
- బాలయ్య కాన్వాయ్‌పై ఫ్లకార్డు విసిరిన వైసిపి కార్యకర్త



సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బాలకృష్ణ

**హిందూపురం, నవంబర్ 16 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడనుందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో బాలయ్య పర్యటనకు వచ్చిన సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా టిడిపి అధ్యక్షులు పార్థసారధి పాల్గొన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ స్వయంగా టిడిపితో పొత్తు పెట్టుకునేందుకు ముందుకు వచ్చారని తద్వారా ఏపిలో రాక్షసపాలన ముగింపు కానుందన్నారు. రెండు పార్టీల కార్యకర్తలు సుశిక్షితులైన సైనికుల్లా మహా యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు. బాలకృష్ణ టిడిపి కండువాపై జనసేన పార్టీ కండువా వేసుకుని జై తెలుగు దేశం, జై జనసేన అంటూ పలుమార్లు నినాదాలు చేశారు. ప్రస్తుతం తాము ప్రతిపక్షంలో వున్నప్పటికి లేపాక్షి మండల గలిబిపల్లిలో 40 లక్షల రూపాయల నిధులతో రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. హిందూపురంలో వైసిపి ప్రభుత్వం ఒక రోడ్డు గానీ కనీసం గుంతలు కూడా పూడ్చలేదని ఎద్దేవా చేశారు. నవరత్నాల పథకం డబ్బు ఎవడబ్బ సొమ్ము అని మన డబ్బే తిరిగి మనకే ఇస్తున్నారని వివరించారు. అప్పుల ఊబిలో రాష్ట్ర ప్రభుత్వం కూరుకపోయిందన్నారు. కొటిపి వద్ద టిడ్కో పథకం కింద 2800 ఇళ్లను తాము నిర్మిస్తే ఇంతవరకు అవి ప్రారంభానికి నోచుకోలేదన్నారు. అమరావతిలో రైతులు ఉద్యమాలు చేస్తుంటే వారిని పెయిడ్ ఆర్టికల్స్ అని వైసిపి పాలకులు విమర్శించారన్నారు. వైజాగ్‌లో జరిగిన పారిశ్రామిక సదస్సులో లక్షల కోట్ల పరిశ్రమలు తెచ్చామని చెప్పుకున్న ప్రభుత్వం ఇంత వరకు కనీసం ఒక్క ఇండస్ట్రీ అయినా ముందుకు వచ్చిందా అని ప్రశ్నించారు. అందుకే పరిశ్రమల సదస్సులో పాల్గొన్న వారంతా సైడ్ ఆర్టిస్టులు అని కామెంట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, మున్సిపల్‌మాజీచైర్మన్ జెవి అనిల్‌కుమార్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, మీడియా కో ఆర్డినేటర్ చంద్రమోహన్‌యాదవ్, పట్టణాధ్యక్షులు రమేష్, రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప, ఎమ్మెల్యే రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా బుధవారం రాత్రి పెళ్లి ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి ఇంటికి వెళుతున్న బాలయ్య కాన్వాయ్‌ని స్థానిక మేళాపురం సర్కిల్ సమీపంలో ఒక వైసిపి కార్యకర్త అడ్డుకుని బాలకృష్ణ వాహనంపై ఫ్లకార్డు విసిరికొట్టాడు. దీంతో వాహనాలు నిలిచిపోగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. రెండు నిమిషాల తరువాత తిరిగి బాలకృష్ణ వాహనం బయలుదేరి వెళ్లింది. వైసిపి కార్యకర్త అడ్డుకునే యత్నం చేసిన విషయం తెలుసుకున్న టిడిపి కార్యకర్తలు జై బాలయ్య అంటూ నినాదాలు చేస్తూ గుడికూడడంతో కొద్దిసేపు టెన్షన్ వాతావరణం నెలకొంది.

# ఫామ్ 6,7,8 దరఖాస్తుల పెండింగ్‌ను వారం రోజుల్లోపు పరిష్కరించేందుకు చర్యలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాకు వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

**అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 16 ప్రభాతవార్త**

విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి గురువారం డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజున పెండింగ్‌లో వున్న దరఖాస్తుల స్థితి, ఈపి, లింగ నిష్పత్తి మరియు ఓటర్ల నమోదు, అనోమలిస్ పెండింగ్ ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఈ రోల్‌పై రిపోర్ట్‌లు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిఆర్ఓ గాయత్రిదేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ వున్న ఫామ్ 6,7,8 దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిశీలన చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జంక్ క్యారెక్టర్స్, 10కిపైన ఎలక్టోలర్స్ ఉన్నవారికి సంబంధించి వారంలోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అడిషన్స్, డిలిషన్స్ ప్రక్రియ మొదలు పెట్టడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించి పది ఫిర్యాదులు రాగా వాటిని సకాలంలో పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. పిఎస్ఇలు, డిఎస్ఇల పరిధిలో డబుల్ ఎంట్రీలను, షిఫ్టెడ్ ఓటర్ల పెండింగ్‌ను వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించేలా చూస్తామన్నారు. జిల్లాలో ఫామ్ 6,7,8 దరఖాస్తులకు సంబంధించి 45 రోజులకు పైబడి వున్న డేటాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత ఈఆర్ఒలు, బిఎల్ఒలతో మాట్లాడి డేటాను సరిచూసుకోవాలన్నారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో డెత్ కేసులు పెండింగ్ వుండడానికి వీలులేదన్నారు. కొత్తగా నియమించిన బిఎల్ఒలకు అన్ని రకాల అంశాలపై తగు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈఆర్ఒలు, ఎఇఆర్ఒలు అత్యంత అప్రమత్తంగా వుంటూ ఏ రకమైన ఫిర్యాదు వచ్చినా సీరియస్‌గా తీసుకుని దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్డీఒలు గ్రంధి వెంకటేష్, రాణి సుష్మిత, శ్రీనివాసులురెడ్డి, డిప్యూటి కలెక్టర్ రవీంద్ర, ఈఆర్ఒలు సుధారాణి, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వనాథ్, డిపిఒ ప్రభాకర్‌రావు, ఎన్నికల విభాగం డిప్యూటి తహశీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన గౌరవం...రాష్ట్రపతితో ముఖాముఖి

- శ్రీ విజ్ఞాన్ కరస్పాండెంట్ కట్టుబడి మస్తాన్



రాష్ట్రపతితో శ్రీ విజ్ఞాన్ విద్యార్థులు

**ఓబుళదేవరచెరువు, నవంబర్ 16, ప్రభాతవార్త**

అంకిత భావంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించినందకు తమ పాఠశాలకు దక్కిన అరుదైన గౌరవం రాష్ట్రపతితో ముఖాముఖి అని శ్రీ విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ కట్టుబడి మస్తాన్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ విజ్ఞాన్ పాఠశాలలో గురువారం విలేకరులతో మస్తాన్ మాట్లాడుతూ.... క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం, క్రీడల్లో విశేష ప్రతిభను గుర్తించి రాష్ట్రపతి భవన్ అధికార వర్గాలు రాష్ట్రపతి భవన్‌లో జరిగే బాలల దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని తమ పాఠశాలకు ఆహ్వానం పంపారన్నారు. ఆ మేరకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులతో రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి చిల్డ్రన్స్ డే వేడుకల్లో పాల్గొనడం తమ పాఠశాలక దక్కిన అరుదైన గౌవరంగా భావిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన విద్యను అందించేందుకు నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. ఈ గౌరవం తమ బాధ్యతలను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంసిహెచ్ ఆసుపత్రి వద్ద బాలయ్య సెల్ఫీ ఛాలెంజ్

- ప్రభుత్వాసుపత్రిలో వసతుల కొరతపై ఆగ్రహం



ఎంసిహెచ్ వద్ద బాలయ్య సెల్ఫీ ఛాలెంజ్



చంటి బిడ్డను ఎత్తుకున్న దృశ్యం

**హిందూపురం, నవంబర్ 16 ప్రభాతవార్త**

హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిని గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో 20 కోట్లకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించిన మాత శిశు ఆసుపత్రి భవనం ఎదుట సెల్ఫీ ఫోటో తీసుకున్న బాలయ్య ప్రభుత్వానికి ఛాలెంజ్ చేశారు. తమ ప్రభుత్వంలో ఈ ఆసుపత్రి నిర్మించామని వైసిపి ప్రభుత్వం వచ్చాక ఏమి నిర్మించారని ప్రశ్నించారు. వార్డులో పర్యటించిన బాలకృష్ణ రోగులకు అందుతున్న వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు. అరకొర వసతులు వున్నాయని రోగులు ఫిర్యాదు చేయగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వైద్యం, వసతులు కల్పించాలని ఆదేశించారు. అంతేకాకు ఒడా వార్డులో పైకప్పు పెచ్చులు ఊడి కింద పడడానికి సిద్ధంగా వున్న దృశ్యాన్ని చూసి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, మున్సిపల్‌మాజీచైర్మన్ అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు రమేష్, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులు పాఠశాలల్లో ఉండేలా కృషి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**శ్రీసత్యసాయిజిల్లా, నవంబర్ 16, ప్రభాతవార్త ప్రతినిధి:**

పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండే విధంగా అన్ని విధాల కృషి చేస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వివరించారు. గురువారం విజయవాడ సెక్రెటేరియట్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నిజిల్లాల కలెక్టర్లతో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ, శిశుసంక్షేమం, ప్రభుత్వ పథకాలు, ఎస్‌డిజి సూచికలు, పాఠశాల విద్య, పరిశ్రమ, టూరిజం ప్రాజెక్టులకు భూసేకరణ, జగనన్నకు చెబుదాం తదిరత అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తొలుత పాఠశాల విద్యకు సంబంధించి జిల్లాలో అమలౌవుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్థూల నమోదు నిష్పత్తికి సంబంధించి లక్ష్యసాధనలో భాగంగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా జిల్లాలో మొదటి తరగతి నుండి ఇంటర్మీడియట్‌వరకు మొత్తం లక్షా 80 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనుఅభ్యశిస్తున్నారని, మరికొంత మంది విద్యార్థులు వివిధ కారణాల రిత్యా పాఠశాల బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో వారి కూడా పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులతో సమన్వయ బృందం ద్వారా కృషి చేస్తున్నామన్నారు. పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి స్థూల నమోదు నిష్పత్తి పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి లలితకుమారి, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ డా.తిప్పేంద్రనాయక్, ఎపిఓ ప్రకాష్ రెడ్డి, టూరిజం మేనేజర్ ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొమ్మినేని శ్రీనివాసరావుకు ఘనస్వాగతం

**పుట్టపర్తి, నవంబర్ 16, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు పుట్టపర్తిలో శ్రీసత్యసాయి జిల్లా ఐఅండ్‌పిఆర్ డిపిఆర్ఓ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతపురం, పుట్టపర్తి పర్యటనకు విచ్చేసి 08:00 గంటల సమయంలో శాంతి భవన్ అతిథి గృహం చేరుకున్న ఆయనకు స్వాగతం పలకడం జరిగింది. ఆయన స్వాగతం పలికిన వారిలో ఐఅండ్‌పిఆర్ డిపిఆర్ఓ కార్యాలయ అధికారులు ఫక్రొద్దీన్, సిబ్బంది ఆంజనేయులు, పెద్దయ్య, విఆర్ఓ సందీప్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు.



కొమ్మినేని శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న డిపిఆర్ఓ ఎడి వేలాయుధం

# రాష్ట్రానికి జగన్ సైకో.. రాప్తాడుకు ప్రకాష్‌రెడ్డి సైకో

- వీరిద్దరిని ఇంటికి పంపాలంటే టిడిపి, జనసేన ఐక్యంగా పని చేయాలి
- చిన్నచిన్న విబేదాలు ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం
- మన మద్య గొడవలు పెట్టే వారు ఉంటారు.. జాగ్రత్తగా ఉందాం..
- రెండు పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో పరిటాల సునీత, సాకే పవన్‌కుమార్ వ్యాఖ్యలు



టిడిపి-జనసేన సమన్వయ కమిటీ సమావేశంలోని దృశ్యాలు



**రాప్తాడు, నవంబర్ 16 ప్రభాతవార్త**

రాష్ట్రానికి సీఎం జగన్ ఒక సైకోలా పట్టుకుంటే.,. రాప్తాడు నియోజకవర్గానికి ఎమ్మెల్యేతోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక సైకోలా మారారని మాజీ మంత్రి పరిటాల సునీత, రాప్తాడు నియోజకవర్గ జనసేన ఇన్‌ఆచర్జ్ సాకే పవన్‌కుమార్‌లు ధ్వజమెత్తారు. వీరిద్దరిని ఇంటికి పంపాలంటే టిడిపి, జనసేన ఐక్యంగాపోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాప్తాడు మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల సునీతతోపాటు టిడిపి ముఖ్య నేతలు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే పవన్‌కుమార్, ఎస్.టి.సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, జిల్లా కార్యదర్శి సిద్దూ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రెండు పార్టీల నాయకులు కలిసి చేపట్టబోయే అంశాల గురించి చర్చించారు. టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో కమిటీ నిర్ణయాలపై సమాలోచనలు చేశారు. ఈ నెల 18 నుంచి ఉమ్మడిగా జనంలోకి వెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ.. టిడిపి అధినేత చంద్రబాబు జైల్లో ఉన్న సమయంలో పవన్‌కళ్యాణ్ స్పందించిన తీరు చాలా మందిని ఆలోచింపజేసిందని అన్నారు. వైసీపీపై మొదటి నుంచి పవన్ కళ్యాణ్ పోరాడుతున్నారని చంద్రబాబు అరెస్టు తర్వాత టిడిపి జనసేన కలిసి పని చేస్తుందని ఆయన చెప్పడం హర్షనీయమన్నారు. ఆ తర్వాత వరుసగా రాష్ట్రస్థాయిలో సమన్వయ కమిటీ సమావేశాలను నిర్వహించుకొని ఒక కార్యచరణ రూపొందించుకున్నారన్నారు. ఇప్పుడు నియోజకవర్గాల్లో కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఉమ్మడిగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రియల్ ఎస్టేట్‌తోపాటు అన్ని వ్యవహారాల్లోనూ ఎమ్మెల్యే సోదరుల దౌర్జన్యాలు కొనసాగుతాయని వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాప్తాడులో లక్ష ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పిన ప్రకాష్‌రెడ్డి ఇప్పటి వరకు ఒక్క ఎకరాకైనా అదనంగా నీరు అందించారా అని ప్రశ్నించారు. గతంలో తాము శాశ్వత ప్రతిపాదికన నీరందించే విధంగా ప్రణాళికలు చేస్తే వాటిని కాదని కొత్తగా ప్రాజెక్టులు తీసుకొస్తామని చెప్పి ఇప్పటి వరకు కనీసం భూ సేకరణ కూడా చేయలేదన్నారు. తహశీల్దారు కార్యాలయాలు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే ఒక మాట ఆయన సోదరులు మరోమాట చెబుతూ రైతులను, ఉద్యోగులను సైతం ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇలాంటి అరాచక పాలనకు ముగింపు పలికేందుకు సమిష్టిగా పని చేద్దామని సునీత పిలుపునిచ్చారు. సమావేశంలో జనసేన నాయకులు సైతం టిడిపితో కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు.

